సాక్షి
కర్నూలు
శుక్రవారం । 13 । డిసెంబర్ । 2024



.. వైద్యం దైవాధీనం

హెచ్ఐవీ బాధితులు తమ బాధలు ఎవ్వరికి చెప్పకోవాలో తెలియక బాధితులు మౌనవేదన అనుభవిస్తున్నారు. సరైన వైద్యం, పింఛన్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో▸



అన్నదానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్య అన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం గడగ్‌కు చెందిన మల్లికార్జున నురంగి, బెంగళూరుకు చెందిన రాజారెడ్డి ఒక్కొక్కరు రూ.1,00,116 చొప్పన విరాళమిచ్చారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.30
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:91.530
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:4,478
అవుట్ ఫ్లో	:5,971

న్యూస్‌రీల్

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి రూ.2.11 లక్షలు విరాళం



విరాళం రసీదును అందుకుంటున్న దాత

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీకృష్ణ దేవాలయ అభివృద్ధి పనులకు అదే గ్రామానికి చెందిన ఆదూరి లక్ష్మన్న, సంజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు రామాంజనేయులు, కామాక్షమ్మ, శైలేష్‌చౌదరి వినీతాచౌదరి రూ.2,11,116 లక్షలు విరాళాన్ని అందజేసినట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు.

18న నంద్యాలలో కిసాన్ మేళా

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 18వ తేదీన కిసాన్ మేళా నిర్వహించనున్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాం జిల్లాలకు చెందిన 1500 మంది రైతులు, అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. నంద్యాల ఆర్ఏఆర్ఎస్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా కిసాన్ మేళా నిర్వహించనున్నాయి. నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగే ఈ మేళాకు వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి అచ్చెన్నాయుడు, ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఆధునిక సాంకేతికతతో అధిక దిగుబడులు అనే అంశంపై కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లుగా నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎం.జాన్సన్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 90 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 84 శాతం, మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో 90 శాతం హాజరు నమోదైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరగగా మొదటి సెమిస్టర్‌కు 5,669 మందికి 4,788 మంది విద్యార్థులు హాజరు కాగా 881 మంది, మూడు, ఐదో సెమిస్టర్‌కు 9,164 మందికి 8,267 మంది హాజరు కాగా 897 మంది గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎమ్మిగనూరు సిద్దార్థ డిగ్రీ కళాశాల కేంద్రం, నంద్యాల ఎస్‌సీ, కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కేంద్రాల్లో ఇద్దరు చొప్పున, ఆదోని జ్యోతిర్మయి, నందికొట్కూరు సాయిరాం, పత్తికొండ విజయ సాయి డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం 11 మంది చూచిరాతకు పాల్పడిగా డిబార్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ బిల్లులు దహనంచేసి నిరసన



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై పడకుండా చూడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్య సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలలకే రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం అన్యాయమన్నారు. ఎన్నికల సమయంలో విద్యుత్ బిల్లులు పెంచబోమని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై భారం వేయడం తగదన్నారు. కార్యక్రమంలో టి.రాముడు, నరసింహుడు, వై.నగేష్, సాయిబాబా పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన మంచినీటి పథకం వర్కర్లు

హొళగుంద: సమ్మతగేరి గ్రామం వద్ద ఉన్న ఎల్లార్తి మంచినీటి పథకంలో పని చేస్తున్న సిబ్బంది జీతాలు ఇవ్వనందుకు గురువారం నుంచి విధులు బహిష్కరించారు. దీంతో ఆ పథకం కింద వచ్చే సమ్మతగేరి, కోగిలతోట, ముగుమానుగుంది, ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లీ, పెద్దహ్యాట గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ పథకం కింద 8 మంది వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెలకు రూ.10 వేల ప్రకారం జీతాలు ఇచ్చేవారు. అయితే వాటర్ స్కీం టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వర్కర్లకు 10 నెలలుగా జీతాలు ఇవ్వడంలేదు. ప్రధానంగా తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) పక్కనే ఉన్న సమ్మతగేరి మినహా మిగిలిన గ్రామాలు కాలువకు దూరంగా ఉండటంతో సమస్య తీవ్రంగా మారే అవకాశముంది.



నమ్మించి నట్టేట ముంచడం అంటే ఇదే. ' సూపర్‌సిక్స్‌తో బతుకులు మారుస్తాం' అని ప్రజలను మభ్యపెట్టి అధికారం దక్కించుకున్న చంద్రబాబు ప్రభుత్వం హామీల అమలులో చేతులెత్తేసింది. ఆర్నెల్ల పాలన పూర్తయినా.. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినా.. ఉచితగ్యాస్ మినహా 'సూపర్‌సిక్స్' అమలు ఊసే లేదు. రైతులు, మహిళలు, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాలూ.. 'కూటమి ప్రభుత్వం' మోసం చేసేందనే భావనకు వచ్చాయి. ఎన్నికల హామీలు అమలు చేయాలని విపక్షపార్టీలు పలు సార్లు డిమాండ్ చేసినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. దీంతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆందోళన బాట పట్టింది. తొలి విడతగా రైతులను ప్రభుత్వం మోసం చేసిన తీరుపై నేడు కలెక్టరేట్ వద్ద నిరసన గళం విన్పించనుంది. ఆర్నెల్లకే రైతులు, విపక్షపార్టీలు రోడ్డెక్కుతున్నాయంటే ప్రభుత్వం ఎంత వేగంగా వ్యతిరేకత మూటకట్టుకుందో స్పష్టమవుతోంది. – సాక్షిప్రతినిధి కర్నూలు



మోసం పాలన.. జనం ఆక్రందన

- ఎన్నికల హామీల అమలును విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ఆర్నెల్ల పాలనలో రైతులతో పాటు అన్ని వర్గాలూ మోసపోయిన వైనం
- సంక్షేమ పథకాలకు దూరమవుతున్న పేదలు
- అన్నదాత సుఖీభవతో ఏటా రూ.20 వేలు ఇస్తామన్న హామీ అతీగతీ లేదు
- అప్పులబాధ తాళలేక ఉమ్మడి జిల్లాలో 41 మంది రైతులు ఆత్మహత్య
- ఏ ఒక్క కుటుంబానికి రూపాయి కూడా పరిహారం ఇవ్వని వైనం
- అన్నదాతలకు మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట
- నేడు నగరంలో భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా



కోడుమూరు మండలం ప్యాలకుర్తిలో మిరప పంటను తొలగిస్తున్న రైతు (ఫైల్)



కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు భారీగా చేరిన ఉల్లి దిగుబడులు (ఫైల్)

నేడు 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ'

సమయం :
శుక్రవారం ఉదయం 10 గంటలు
రైతులు చేరుకోవాల్సిన స్థలం :
గౌరిగోపాల్ ఆసుపత్రి వద్ద ఉన్న ధర్నా చౌక్
నిరసన ఇలా :
భారీ ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నా

జిల్లాలో అత్యధికశాతం వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతు కుటుంబాలే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే 'అన్నదాత సుఖీభవ' పేరుతో ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లు ముగిసినా ఒక్కరికీ చిల్ల గవ్వ ఇవ్వలేదు. గత ప్రభుత్వం 'రైతుభరోసా–పీఎం కిసాన్' ద్వారా ఏటా రైతులకు రూ.13,500 ఖాతాల్లో జమ చేసేది. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లు 5 విడతలుగా మొత్తం రూ.2,247.93కోట్లు జమ చేసింది. ఈ పథకం ద్వారా ఏటా సగటున 2.94 లక్షల మంది రైతులకు మేలు జరిగేది! కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పథకం అమలు చేయలేదు. 2023 ఉచిత పంటల బీమా ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లో చేరలేదు. ఉచిత పంటలబీమాకు మంగళం పాడింది. సున్నావడ్డీ రుణాల సంగతి అతీగతీ లేదు. ఖరీఫ్, రబీ సీజన్‌తో ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ముగిసినా ప్రభుత్వం నుంచి రైతుకు దమ్మిడి భరోసా లేదు. జిల్లాలో భారీ వర్షాలతో పంటలు నష్టపోయినా పట్టించుకునే నాథుడే లేడు. ఓ వైపు ఉల్లి రైతులు, మరో వైపు టమాట రైతులు రోడ్డెక్కినా చలనం లేదు. గిట్టు బాటు ధర అందక పత్తి రైతులు ఆందోళన చెందుతున్నా ఆదుకున్న వారు లేరు. పచ్చి మిరపకు ధర లేక వందలాది ఎకరాల్లో పంటను దున్నేశారు. సకాలంలో పంట రుణాలు అందక రైతు కుటుంబాలన్నీ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి. ప్రభుత్వం చేతిలో మోసపోయి నష్టపోయిన రైతులకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ శుక్రవారం ఆందోళన చేపట్టనుంది. కర్నూలు ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకూ ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. ఆపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించనున్నారు.

41 మంది రైతులు బలవన్మరణం..

ఈ ఆర్నెల్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 41 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారంటే ప్రభుత్వ పాలన ఎంత అధ్వానంగా ఉందో ఇట్టే తెలుస్తోంది. వారి కుటుంబాలకు పరిహారం కూడా ఇవ్వలేదు. గత ప్రభుత్వంలో ఏదైనా కారణాలతో రైతులు, కౌలు రైతులు ఆత్మహత్య చేసుకుంటే నెలలోపే రైతు కుటుంబీకుల ఖాతాల్లో రూ.7లక్షలు జమ అయ్యేది. త్రీమెన్ కమిటీ (ఆర్డీవో, వ్యవసాయశాఖ ఏడీ, డీఎస్పీ) సిఫార్సు ఉండి పరిహారం అందని ఒక్క రైతు కుటుంబం లేదు. సీసీఆర్డీ కార్డు (కౌలు రైతు గుర్తింపు కార్డు) ఉండి ఆత్మహత్య చేసుకుని పరిహారం అందని ఒక్క కౌలు రైతు కుటుంబం కూడా లేదు. దీన్నిబట్టే గత ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో స్పష్టమవుతోంది. చివరకు 2014–2019 మార్చి వరకూ టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆత్మహత్య చేసుకున్న 321 మందిలో 181 మందికి అప్పటి ప్రభుత్వం పరిహారం ఇవ్వకపోతే ఆ జాబితాలో వారికి కూడా జగన్ ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం వచ్చింది. ఆపై పరిహారాన్ని రూ.7 లక్షలకు పెంచింది. 2004 మార్చి వరకూ రైతు ఆత్మహత్యలకు అప్పటికే రెండుసార్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదు. 2004లో అప్పటి సీఎం వైఎస్సార్ 421 జీవో జారీ చేసి 'అప్పులబాధ తాళలేక రైతు కుటుంబంలో జరిగిన ఎలాంటి ఆత్మహత్యనైనా రైతు ఆత్మహత్యగా పరిగణించాలి' అని పేర్కొన్నారు. అప్పట్లో రూ.1.50 లక్షలు పరిహారం అందించారు.

ఐదేళ్లూ వ్యవసాయాన్ని పండుగ చేసిన వైఎస్ జగన్..

2019–2023 వరకూ ఐదేళ్లలో నాలుగేళ్లు మంచి వర్షాలతో రైతులకు బంగారు పంటలు పండాయి. 2023 మినహా నాలుగేళ్లు ఒక్క కరువు మండలం ప్రకటించలేదు. 2023లో కరువు మండలాలు ప్రకటించిన తర్వాత 3,48,726 మందికి రూ.433.70 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించింది. అధిక వర్షాలకు పంటలు దెబ్బతింటే 1,39,265 మందికి రూ.115.29 కోట్లు పరిహారం ఇచ్చింది. ఉచిత పంటలబీమా ద్వారా రూ.1065.51కోట్లు చెల్లించింది. సున్నావడ్డీ ద్వారా రూ.72.31 కోట్లు చెల్లించింది. చివరకు రైతు మిత్ర గ్రూపులకు యంత్రీకరణ కోసం రూ.17.35కోట్లు సబ్సిడీ చెల్లించింది. ఇలా ప్రతీ విషయంలో రైతులకు అండగా నిలిచింది.

ఆర్నెల్ల పాలనలో అన్ని వర్గాలకూ మోసం..

ఆర్నెళ్ల పాలనలో రైతులు, మహిళలు, విద్యార్థులను బడికి పంపే తల్లులు, నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసింది. అన్నదాత సుఖీభవతో పాటు తల్లికివందనం పేరుతో బడికి వెళ్లే ఒక్కో విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ఈ విద్యాసంవత్సరం ముగుస్తున్నా అతీగతీ లేదు. గత ప్రభుత్వం ఐదేళ్లూ 'అమ్మ ఒడి'ని అమలు చేసింది. మహిళలకు 'ఉచిత బస్సు' పథకం అమలు చేయలేదు. ఇంట్లో 18 ఏళ్లు నిండిన మహిళలు ఎంతమంది ఉన్నా ఒక్కొక్కరికి నెలకు రూ.1,500 చొప్పున ఆడబిడ్డ నిధి ద్వారా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఇవ్వలేదు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అప్పటి వరకూ నెలకు రూ.2వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. అదీ అమలు చేయలేదు.



ఆర్నెల్లలో ప్రధాన పథకాలు అమలు చేయకపోవడంతో వాటిల్లిన నష్టం ఇలా.. (రూ. కోట్లలో)

- అన్నదాత సుఖీభవ: 2,94,598 మంది రైతులకు వాటిల్లిన నష్టం 589.19
- ఆడబిడ్డ నిధి ద్వారా 18 ఏళ్లు నిండిన మహిళలు నష్టపోయిన మొత్తం: 1635.50
- యువనేస్తం ద్వారా నిరుద్యోగులకు ఈ ఏడాది వాటిల్లే నష్టం: 1678.85
- తల్లికి వందనం అమలు చేయకపోవడంతో కలిగిన నష్టం: 727.93
- ఉచిత బస్సు అమలు చేయకపోవడంతో కలిగే నష్టం: 255.50

రైతులను మోసం చేసిన ప్రభుత్వంపై నిరసన గళం



కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోంది. గిట్టుబాటు ధర లేదు. పత్తి, టమాట రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి క్వింటాకు రూ.7వేలు ఇవ్వడం లేదు. గత ప్రభుత్వంలో రైతులకు రైతుభరోసా కేంద్రాలు దన్నుగా ఉండేవి. రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు ఇస్తామని మోసం చేసింది. ఉచిత పంటలబీమా ఇవ్వలేదు. రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం మోసం చేసింది. నేడు కర్నూలులో ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలుపుతాం. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వం మేల్కొనేలా నిరసన గళం విప్పాలి. – ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

పత్తి రైతును ఆదుకోండి

- వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



పత్తి కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): పత్తి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగర శివారులోని పెంచికలపాడు వద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. పత్తి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడం, కేంద్రంలో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు రైతులు వాపోయారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు రూ.వేలకు రూ.వేలు అప్పు చేసి పత్తిని సాగు చేశారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి తడిసి ఉండవచ్చన్నారు. తేమ శాతం 12 కన్నా ఎక్కువ ఉందన్న కారణంతో కొనుగోలు చేయకపోవడం తగదన్నారు. కొనుగోలులో జాప్యం జరగకుండా రైతుల రద్దీని బట్టి టోకెన్లు ఇచ్చి, వాటి ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రం వద్దే రైతులకు భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోరుతూ శుక్రవారం కర్నూలులో ర్యాలీ చేపట్టనున్నామన్నారు. ధర్నా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



వడ్లను పరిశీలిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని రేమడూరు రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేయడం చంద్రబాబు నాయుడి నైజమన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక పథకాలు చూస్తే భయమేస్తుందని అనడం ఎంత వరకు సబబు అన్నారు. పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లేక అన్నదాతలు నష్టపోతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనేదన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతుల కష్టానికి తగిన ఫలితం దొరకడం లేదన్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో దిగుబడులు తగ్గాయని, వరి ధాన్యం రంగు మారిందని అన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో పంటల దిగుబడులను తక్కువ ధరకే దళారులకు విక్రయించుకోవాల్సి వస్తుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో దళారులు లేని వ్యవస్థను అమలు చేశామన్నారు. రైతన్నల సమస్యల పరిష్కారం కోరుతూ నంద్యాల జిల్లా కేంద్రంలోని ఉదయానంద్ హోటల్ నుంచి కలెక్టరేట్ వరకు రైతులతో కలిసి ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ధర్నాకు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు తరలిరావాలని ఆయన కోరారు.

నకిలీ సదరం సర్టిఫికెట్లు జారీ చేస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): అంగవైకల్యం లేని వారికి నకిలీ సదరం సర్టిఫికెట్లు జారీ చేసినా, సదరం సర్టిఫికెట్లలో వైకల్యం శాతాన్ని పెంచినా అలాంటి వైద్యులు, ఇతర ఉద్యోగులపై ఫిర్యాదులొస్తే చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో పలు విభాగాల హెచ్‌వోడీలు, సదరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరంపై అప్రూవల్ అయిన కేసులు, పెండింగ్ కేసులు, ఇతర కేసులపై ఆరా తీశారు. ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. సదరంలో ఎవరైనా అవినీతికి పాల్పడినట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్ల జారీలో పాల్గొన్న వైద్యులతో సహ ఉద్యోగులందరూ వైకల్య ధ్రువీకరణ పత్రాలను ప్రాసెస్ చేయడంలో మరింత జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, వైద్యులు శ్రీనివాసులు(ఆర్థోపెడిక్), సి.శ్రీనివాసులు(న్యూరాలజి), నాగేశ్వరరావు(సైకియాట్రి), రామ బాలాజీనాయక్(న్యూరోసర్జరి), వీరకుమార్(ఈఎన్‌టి) తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు వెంటనే పెన్షన్

- కలెక్టర్ రంజిత్‌బాషా ఆలోచనకు ఓకే చెప్పిన సీఎం చంద్రబాబు



కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): తల్లిదండ్రులిద్దరూ చనిపోయి అనాథలైన పిల్లలకు వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చేసిన విజ్ఞప్తికి సీఎం చంద్రబాబునాయుడు ఓకే చెప్పారు. అమరావతిలోని వెలగపూడి ఏపీ సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రెండో రోజు పెన్షన్లపై చర్చ సందర్భంగా ఈ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రుల్లో ప్రసవ సమయంలో తల్లి చనిపోయి అనాథగా మారిన పిల్లలకు, ప్రమాదాల్లో తల్లిదండ్రులిద్దరూ చనిపోయి అనాథలైన పిల్లలకు, పాక్షికంగా అనాథలైన పిల్లలకు ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ మంజూరు చేస్తే వారికి కొంత ఉపశమనం కలుగుతుందని సీఎంకు చెప్పినట్లు కలెక్టర్ వివరించారు. తన వినతిపై సీఎం స్పందించి తల్లిదండ్రులు చనిపోయిన వారికి సాయం చేద్దామని, ఇందుకు సంబంధించి గైడ్‌లైన్స్‌ను తయారు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించినట్లు చెప్పారు. మొదటి కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భర్త చనిపోయిన వెంటనే అతని భార్యకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని తాను కోరితే అప్పట్లో కూడా అందుకు సీఎం ఒప్పుకున్నట్లు చెప్పారు.

8,457 క్యూసెక్కుల నీటి మళ్లింపు

శ్రీశైలంప్రాజెక్ట్: భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో బుధవారం నుంచి గురువారం వరకు పంప్‌మోడ్ ఆపరేషన్‌తో 8,457 క్యూసెక్కుల నీటిని మళ్లించారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రిడ్‌లో మిగులు విద్యుత్‌ను వినియోగించుకుని శ్రీశైలం డ్యాం దిగువ భాగంలో ఉన్న నీటిని జలాశయంలోకి మళ్లించారు. జలాశయంలోని 6,049 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుని భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో 2.795 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. శ్రీశైలం దిగువ ప్రాజెక్టులైన నాగార్జునసాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల, హంద్రీనీవా సుజలస్రవంతి, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 11,538 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

ఫిబ్రవరిలోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

- జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రరావు

ఆలూరు రూరల్: రిటైర్డ్ ఉద్యోగులు ఫిబ్రవరి నెలాఖరులోపు లైఫ్ సర్టిఫికెట్లు సబ్ ట్రెజరీ ఆఫీసులో సమర్పించాలని జిల్లా ట్రెజరీ ఆఫీసర్ రామచంద్రరావు తెలిపారు. గురువారం ఆయన ఆలూరు సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2025–26 ఏడాదిలో రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ పొందాలంటే ఇకనుంచి జనవరి నుంచి ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్ అందించాలన్నారు. గతంలో మాదిరి అక్టోబర్, నవంబర్ నెలలో సర్టిఫికెట్లు అందిస్తే పెన్షన్ నగదు ఖాతాల్లో జమ కాదన్నారు. అనారోగ్యంతో మంచం పట్టిన పెన్షనర్లు సబ్ ట్రెజరీ అధికారితో వీడియో కాల్ ద్వారా మాట్లాడి ఇతరుల ద్వారా లైఫ్ సర్టిఫికెట్ అందిచవచ్చన్నారు. సబ్ ట్రెజరీ అధికారి ఇంటికెళ్లి బయోమెట్రిక్ నమోదు చేసుకుంటారన్నారు. అలాగే రాష్ట్రంలోని ఏ సబ్ ట్రెజరీ ఆఫీసుకు వెళ్లి సర్టిఫికెట్ అందించవచ్చని.. జీవన్ ప్రమాణ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ ద్వారా ఆన్‌లైన్ నందు లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చే వెసలుబాటు ఉందన్నారు. ఆయన వెంట ఆలూరు ఎస్టీఓ శ్రీనివాసులు సిబ్బంది బాలు, ఉలిగప్ప, రిటైర్డ్ ఉద్యోగులు గోవిందప్ప,తిమ్మప్ప, ఈరన్న ఉన్నారు.

క్లుప్తంగా

నాటుసారా తాగి వృద్ధుడి మృతి

కొలిమిగుండ్ల: మండలంలో నాటుసారా ఘాటుకు వృద్ధుడు బలయ్యాడు. వివరాలు.. మీర్జాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు పిక్కిలి నాగన్న (65) సమీప నాపరాతి గనుల్లో పనులకు వెళుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం ఊరి శివారులో నాటుసారా అమ్మకాలు జరిగే చోట సారా సేవించి అక్కడే పడిపోయాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో వారు వచ్చి ఇంటికి తీసుకెళ్లారు. కాసేపటికే నాగన్న మృతి చెందాడు. చిన్న గ్రామంలో మూడుచోట్ల నాటు సారా విక్రయాలు జరుగుతున్నారని, కొందరు పూర్తిగా సారాకు బానిసలుగా మారుతున్నారని గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో నాటు సారా అమ్మకాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హిజ్రాపై కత్తితో దాడి

బొమ్మలసత్రం: హిజ్రా తనను నడిరోడ్డుపై అవమానకరంగా దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురైన వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలలోని నడిగడ్డ వీధికి చెందిన మాబాషా కొంతకాలం క్రితం నుంచి భార్యతో మనస్పర్థల కారణంగా వేరుగా ఉంటున్నారు. ఈ క్రమంలో గురువారం పనినిమిత్తం వన్‌టౌన్ పరిధిలోని ఓ దుకాణం వద్ద మాబాషా నిలబడి ఉండగా నూర్‌బాషా అనే హిజ్రా ఎదురుపడ్డాడు. మాబాషా భార్యకు హిజ్రా బంధువు కావటంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. ఈ క్రమంలో హిజ్రా నోటికి వచ్చిన బూతులతో దుర్భాషలాడటంతో ఆవేశానికి గురైన మాబాషా పక్కనే ఉన్న కత్తితో దాడి చేశాడు. హిజ్రా చేయి అడ్డుపెట్టడంతో చేతికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మాబాషా, బంధువు అబ్దుల్లాపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి



గొర్రెలు మృతిచెందడంతో విలపిస్తున్న బాధితులు

మహానంది: గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవారికి తీరని నష్టం కలిగింది. వీధి కుక్కల స్వైర విహారంతో సుమారు 30 గొర్రెలు మృత్యువాత పడటంతో బాధితులు శోకసంద్రంలో మునిగారు. వివరాలు.. గాజులపల్లెకు చెందిన చాకలి రామకృష్ణ, కుటుంబసభ్యులు గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గ్రామంలోని పాత శివాలయం వెనుక ఓ చిన్న పాకలో గొర్రెలను ఉంచుతారు. గురువారం పాక వద్ద ఎవరూ లేని సమయంలో వీధి కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. దాడిలో సుమారు 30 గొర్రెలు మృతి చెందినట్లు రామకృష్ణ, కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మార్గంలో పెద్దగా రాకపోకలు లేకపోవడంతో కుక్కల దాడిని ఎవరూ గమనించలేకపోయారు. ఈ ఘటనలో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. పశువైద్యులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కే.పుష్పక్ తెలిపారు. ఈ నెల 16 నుంచి నుంచి 10 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన యువకులు ఎమ్మిగనూరు మండలం బనవాసిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు చేరుకోవాలని సూచించారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని, శిక్షణా కాలంలో ఉచితంగా భోజనం, హాస్టల్ వసతి కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన యువకులు నాలుగు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్, విద్యార్హత ధ్రువ పత్రాల నకళ్లతో బనవాసి కేవీకేకు చేరుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90007 10508 నంబరును సంప్రదించవచ్చన్నారు.

మాయదారి రోగం.. వైద్యం దైవాధీనం!

- హెచ్ఐవీ బాధితుల మౌన వేదన
- మందులు సక్రమంగా ఇవ్వని వైనం
- తప్పుడు రక్తపరీక్షలతో ప్రాణాలతో చెలగాటం
- ఉమ్మడి జిల్లా మొత్తానికి ఒక్కరే వైద్యులు
- 26,562 బాధితుల్లో 1,069 మందికే పెన్షన్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో హెచ్ఐవీ బాధితుల వివరాలు

జిల్లా	హెచ్ఐవీ బాధితులు	మందులు వాడుతున్న వారు	పెన్షన్లు పొందుతున్న వారు
కర్నూలు	18,843	7,485	668
నంద్యాల	7,719	4,864	401



కర్నూలు(హాస్పిటల్): 'ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం' అంటూ ఎయిడ్స్ డే రోజు ర్యాలీలు, సదస్సులతో హడావుడి చేసే అధికారులు బాధితులకు అందించే వైద్యంపై దృష్టి సారించడం లేదు. సరైన వైద్యం అందక, మందుల వినియోగంపై అవగాహన లేక బాధితులు విలవిలలాడుతున్నారు. హెచ్ఐవీ అంటేనే చాలా మంది భయపడిపోతారు. ఆ వ్యాధి వచ్చిన వారికి సాధ్యమైనంత దూరంగా ఉంటారు. ఇక హెచ్ఐవీ వచ్చిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. కొన్నిసార్లు కుటుంబసభ్యులే వారిని సరిగ్గా చూసుకోలేని పరిస్థితి. ఆసుపత్రికి వెళితే సరిగ్గా స్పందించని సిబ్బంది.. వారి సంక్షేమాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఐదు శాతం మంది బాధితులకు కూడా పెన్షన్లు కూడా అందడం లేదు. ఫలితంగా తమ బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు మౌనవేదన అనుభవిస్తున్నారు. కర్నూలు జిల్లాలో కర్నూలుతో పాటు ఆదోనిలో ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు మూడు లింక్ ఏఆర్‌టీలను ఏర్పాటు చేశారు. వీటిలో నవంబర్ వరకు 18,843 మంది హెచ్ఐవీ బాధితులు నమోదు చేసుకున్నారు. కానీ మందులు వాడుతున్నది మాత్రం 7,485 మంది మాత్రమే. కర్నూలులోని ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో రెండవ రకం మందులు వాడుతున్న వారు 669 మంది ఉన్నారు. కాగా జిల్లా మొత్తానికి కేవలం 668 మందికి మాత్రమే పెన్షన్లు ఇస్తున్నారు. నంద్యాల జిల్లాలో 7,719 మంది బాధితులు ఉండగా వీరిలో మందులు వాడుతున్నది 4,864 మంది మాత్రమే. రెండవ రకం మందులు వాడుతున్న వారు 324 మంది ఉన్నారు. పెన్షన్లు 401 మంది పొందుతున్నారు. చాలా మంది పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా వాటి గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. కర్నూలులో ముగ్గురు వైద్యులు, ఆదోనిలో ఒక వైద్యులుండాలి. కానీ ఈ రెండు చోట్లా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో నంద్యాలలో పనిచేసే వైద్యురాలిని కర్నూలుకు డిప్యుటేషన్‌పై వేశారు. ఈ కారణంగా నంద్యాలలోని ఏఆర్‌టీ కేంద్రంలో వైద్యుల పోస్టు ఖాళీగా మారింది. కర్నూలులోని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి విభాగంలో ఐదు పోస్టులకు గాను ఇద్దరే గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ కారణంగా ఉన్న వారిపై పనిభారం అధికమైంది. వీరు తీవ్ర పని ఒత్తిడితో, మానసిక ఒత్తిడితో పనిచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

అందరికీ ఒకే చోట వైద్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కర్నూలులో మాత్రమే డాక్టర్ ఉండటంతో చాలా మంది చికిత్స కోసం కర్నూలుకు వస్తున్నారు. ఈ మేరకు ప్రతిరోజూ 150 నుంచి 200 మంది వరకు హెచ్ఐవీ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. వాస్తవానికి కర్నూలులోని ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలో డాక్టర్‌కు, కౌన్సిలర్‌కు ప్రత్యేక చాంబర్లు ఉన్నాయి. రోగుల సౌకర్యార్థం వీటిని ఏర్పాటు చేశారు. రోగులను ఆయా చాంబర్లలో మాత్రమే పిలిచి వైద్యం చేయాలి. కానీ ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలోకి వెళ్లగానే ఎదురుగా ఉన్న నర్సెస్ స్టేషన్‌లో వారి పేర్లు రిజిస్టర్ చేసుకోవడంతో పాటు అక్కడే వైద్యురాలు కూర్చుని మూకుమ్మడిగా వైద్యం అందిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దీనివల్ల తాము వ్యక్తిగత సమస్యలు చెప్పుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని రోగులు వాపోతున్నారు. ఇద్దరు కౌన్సిలర్లు ఉండాల్సిన చోట ఒక్కరే ఉండటంతో కౌన్సిలింగ్ కూడా సరిగ్గా జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ల్యాబ్‌టెక్నీషియన్ పనితీరుపై విమర్శలు

కర్నూలులోని ఏఆర్‌టీ ప్లస్ కేంద్రంలో ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు ఉన్నారు. వీరిలో ఒకరి పనితీరుపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శాంపిల్ తీయడానికి ఇబ్బందులు పడటం, తప్పుడు నివేదికలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీరు ఇచ్చిన నివేదికల ఆధారంగా రోగులకు అధిక డోసు మందులు ఇవ్వడం వల్ల ప్రాణాపాయం ఏర్పడిందన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంతో పాటు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు సైతం విచారణ చేసిన నివేదికలు తయారు చేసి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపించినట్లు సమాచారం. ఈ నివేదికల ఆధారంగా త్వరలో సదరు ల్యాబ్‌టెక్నీషియన్‌పై చర్యలు ఉండనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏఆర్‌టీ మందులూ ఇవ్వని వైనం

ఏఆర్‌టీ కేంద్రంలో చికిత్స కోసం వచ్చిన వారికి సీడీ ఫోర్ కౌంటర్ ఆధారంగా అవసరమైన మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎవ్వరికి ఏఏ మందులు ఇవ్వాలో వైద్యులు సూచిస్తారు. కానీ జిల్లాలో మందు లు సైతం రోగులకు సక్రమంగా ఇవ్వడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులకు హెచ్ఐవీ వస్తే వారు ఏఆర్‌టీ కేంద్రాలకు వచ్చి మందులు తీసుకోవడానికి సంశయిస్తున్నారు. ఇలాంటి వారిని పసిగట్టి వారి వద్ద డబ్బులు తీసుకుని ఏఆర్‌టీ మందులు ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఏఆర్‌టీ కేంద్రాల పనితీరును పర్యవేక్షిస్తున్నాం



జిల్లాలోని ఏఆర్‌టీ కేంద్రాల పనితీరును పర్యవేక్షిస్తున్నాం. ఆయా కేంద్రాల్లో రిజిస్టర్ అయిన హెచ్ఐవీ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. కర్నూలులోని ఏఆర్‌టి ప్లస్ కేంద్రంలో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒక ల్యాబ్‌టెక్నీషియన్‌పై ఫిర్యాదులు రావడంతో విచారణ చేయించి నివేదికలు పంపించాం. ఈ మేరకు త్వరలో చర్యలు తీసుకుంటాం. అందరికీ పెన్షన్లు ఇవ్వడం మా పరిధిలో లేదు. పెన్షన్ల దరఖాస్తులను పంపించాం. మంజూరైన వారికి అందజేస్తాం.

– డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగాధికారి, కర్నూలు

ఆదోని వాసికి గద్దర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బి.శ్రీనివాస్

ఆదోని రూరల్: ఆదోనికి చెందిన బి.శ్రీనివాస్‌కు పి.గన్నవరంలోని సాయితేజ కళాశాల ప్రాంగణంలో మమతా స్వచ్ఛందసేవా సమితి నిర్వాహకులు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో గద్దర్ జాతీయ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం మాట్లాడుతూ.. మమతా స్వచ్ఛంద సేవా సమితి దేశవ్యాప్తంగా విశిష్ట సేవలు అందిస్తున్న వారిని ఎంపిక చేసి పి.గన్నవరంలో ప్రముఖుల చేతులమీదుగా స్వర్గీయ గద్దర్ జాతీయ అవార్డును అందజేస్తున్నట్లు చెప్పారు. తాను 2108 నుంచి ఆంధ్రప్రదేశ పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర మీడియా ప్రచార కార్యదర్శిగా విద్యార్థులకు మెరుగైన సేవలు అందించేందుకు చేసిన కృషికి గాను అక్కడి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు వివరించారు. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, మరిన్ని సేవా కార్యక్రమలు చేపడతానన్నారు.

వేతనాలకు గ్రీన్‌సిగ్నల్

- ఎట్టకేలకు టీబీ డ్యాం ఉద్యోగులకు వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం అనుమతి
- అత్యవసర పనులు, డ్యాం గేట్ల నిర్వహణకు నిధులకు నో పర్మిషన్
- గేట్లకు తాత్కాలిక మరమ్మతులపై స్పష్టత కరువు

కర్నూలు సిటీ: సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తీసుకుంటున్న నిర్ణయాలతో ఒక వైపు ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేతనాలు అందక ఆందోళనల బాట పట్టడంతో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డ్యాం ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్ల చెల్లింపునకు గురువారం అనుమతి ఇచ్చింది. గత ప్రభుత్వం హయాంలో ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ ఆధునికీకరణ పనులు చేసి బిల్లుల చెల్లింపునకు ఆర్థిక శాఖకు పంపగా, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బిల్లుల చెల్లింపు జరగలేదు. ఎన్నికల తర్వాత ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టింది. అధికార బాధ్యతలు స్వీకరించిన కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు, నిధుల లభ్యతను బట్టి బిల్లులు క్లియర్ చేస్తోంది. విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా, రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాస్ ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ పనుల్లో అవకతవకలు జరిగాయంటూ ఏపీ ఆర్థిక శాఖకు ఈ ఏడాది సెప్టెంబరు 5వ తేదీన లేఖ రాయగా, ఆ లేఖ ఆధారంగా సెప్టెంబరు 13న ఏపీ ఫైనాన్స్ డిప్యూటీ సెక్రటరీ టీబీ బోర్డుకు రాసిన లేఖతో బోర్డు అకౌంట్లను కర్ణాటక ట్రెజరీ బ్లాక్ చేసింది. దీంతో అక్టోబరు నెల వేతనాలు పూర్తిగా నిలిచిపోయాయి. నవంబరు నెల వేతనాలు కూడా బిల్లులు చేయలేదు. దీని వల్ల ఎల్ఎల్‌సీ కాలువ 0 కి.మీ నుంచి 250 కి.మీ వరకు లస్కరు, సూపర్‌వైజర్లు, కేర్ టికర్స్ తదితరులు 165 మంది, 97 మంది రిటైర్డ్ అయిన ఉద్యోగులకు పింఛన్ అందకపోవడంతో అవస్థలు పడి బోర్డు ఆఫీస్, సెక్రటరీ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేశారు. దీనిపై స్పందించిన కర్ణాటక ఆర్థిక శాఖ బోర్డు అకౌంట్లు ఓపెన్ చేసేందుకు ఏపీ ఆర్థిక శాఖ తమకు లేఖ రాస్తే అందుబాటులో ఉండే నిధుల నుంచి వేతనాలు, పింఛన్లు చెల్లిస్తామని చెప్పడంతో ఏపీ ఆర్థిక శాఖ కేవలం వేతనాలకు అనుమతించింది. దీంతో బ్లాక్ చేసిన అకౌంట్లను తిరిగి ప్రారంభించి నాలుగైదు రోజుల్లోనే ఖాతాల్లో వేతనాలు జమ చేయనున్నట్లు కర్ణాటక ట్రెజరీ అధికారులు ఉద్యోగులకు సమాచారం ఇచ్చారు.

అత్యవసర పనుల బిల్లులకు నో !

తుంగభద్ర ప్రాజెక్టు పరిధిలో అత్యవసరంగా చేపట్టిన పనులు, గేట్ల నిర్వహణకు రూ.14 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిన్న చిన్న కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు చేశారు. వీరికి బిల్లులు చెల్లించేందుకు డ్యాం అత్యవసర పనులు, నిర్వహణకు ఇచ్చిన నిధుల వినియోగానికి ఎలాంటి అనుమతులు ఇవ్వకపోవడంతో డ్యాం గేట్ల నిర్వహణ భారం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది టీబీ డ్యాంకు వచ్చిన వరద కారణంగా డ్యాం 19వ గేటు కొట్టుకుపోయింది. ఆ సమయంలో అత్యవసరంగా పనులు చేపట్టి నీరు వృథా కాకుండా చేశారు. ఈ గేటుతో పాటు, ఇతర గేట్లకు గ్రీజు వేసేందుకు సైతం నిధులు ఇవ్వలేదని ఇంజినీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

సాగునీటి సంఘాల ఎన్నికలపై కుట్రలు

- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను పోటీకి దూరం చేసేలా అధికారుల చర్యలు



బండి ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద లింగాపురం వైఎస్సార్‌సీపీ నాయకులు

బండిఆత్మకూరు: ఈ నెల 14వ తేదీన జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీచేసే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు రెవెన్యూ అధికారులు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారు. లింగాపురానికి చెందిన సగిలె కృష్ణారెడ్డి, నరెద్దుల సుబ్బారెడ్డి, సి.నరసింహారెడ్డితో పాటు మరికొందరు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని, కొత్త చెరువుకు సంబంధించి పోటీచేసే విషయమై నీటి తీరువా పన్ను కట్టేందుకు తహసీల్దార్ పద్మావతిని సంప్రదించారు. ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదని తహసీల్దార్ చెప్పడంతో రెవెన్యూ అధికారుల తీరుపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కరోజు ముందు వరకు పన్ను కట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు



తవ్వకాలు జరిపిన పురాతన బావి



శివలింగాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

- పురాతన బావిలోని శివలింగాన్ని ధ్వంసం చేసిన ఆగంతకులు
- వెంకటాపురం గ్రామంలో ఘటన

డోన్ రూరల్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని ఆగంతకులు గుప్త నిధులు కోసం తవ్వకాలు చేపట్టారు. గ్రామంలోని పురాతన బావిలో ఉన్న శివలింగాన్ని ధ్వంసం చేశారు. గురువారం ఉదయం శివలింగం ధ్వంసమై ఉండటంతో గ్రామస్తులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గతంలో రెండుసార్లు తవ్వకాలు

గతంలో 2013లోనూ, నాలుగేళ్ల క్రితం మరోసారి గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారని, నంది విగ్రహాన్ని ధ్వంసం చేశారని గ్రామస్తులు చెప్పారు. దుండగులు పదే, పదే తవ్వకాలు జరుపుతుండటంతో గ్రామంలోని ప్రజలు భయాందోళనకు గురౌతున్నారు. సంఘటన జరిగినప్పుడు పోలీసులు గ్రామంలోకి వస్తున్నారు. పరిశీలిస్తున్నారు.వెళ్లిపోతున్నారు. దుండగులను ఒక్కరిని కూడా పట్టుకోకపోవడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడైనా పోలీసులు దృష్టి పెట్టి దుండగులను పట్టుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

- 15 బాక్సుల మద్యం సీజ్
- ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన మద్యంను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణకు చెందిన 15 బాక్సుల మద్యం ఎక్సైజ్ అధికారుల తనిఖీల్లో పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ సీఐ చంద్రహాస్, ఎస్ఐ రెహనా బేగం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని బళ్లారి చౌరస్తా వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైపు నుంచి వస్తున్న ఆటోను ఆపి తనిఖీ చేయగా అందులో 9 బాక్సులు కర్ణాటక మద్యం, 6 బాక్సుల తెలంగాణ మద్యం బయటపడింది. ఆటోలో ఉన్న బిర్లాగేట్ ప్రాంతానికి చెందిన బోయ విజయ్‌కుమార్, బాలాజీ నగర్‌కు చెందిన బోయ రంగన్నను అదుపులోకి తీసుకుని విచారించగా మద్యంను బోయ వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కర్ణాటక నుంచి తీసుకువచ్చి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. వారిద్దరినీ రిమాండ్‌కు పంపి వెంకటేశ్వర్లు కోసం గాలిస్తున్నట్లు సీఐ చంద్రహాస్ తెలిపారు.

500 కేజీల నల్లబెల్లం స్వాధీనం

నాటుసారా తయారీకి ఉపయోగించే 500 కేజీల నల్లబెల్లం, 20 లీటర్ల నాటుసారాను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. బంగారుపేటకు చెందిన నీలిషికారి మోతికి సంబంధించిన సరుకుగా విచారణలో గుర్తించారు. అతనిని అరెస్టు చేయాల్సి ఉందని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది వెంకటేశ్వర్లు, రామలింగయ్య, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై చేయి చేసుకున్న ఎంఈఓ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని ఎం.కీర్తిని చితకబాదిన ఎంఈఓ–2 మధుసూదన్‌రాజుపై చర్యలు తీసువాలని తల్లిదండ్రులు రాజారావు, రుగ్గమ్మ కోరారు. వారు గురువారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ.. బుధవారం పాఠశాలకు వచ్చిన ఎంఈఓ–2 మధుసూదన్‌రాజు.. విద్యార్థిని కీర్తి తన అక్కకు బాయ్ చెబుతుండగా గమనించి, తాను వచ్చినా నమస్తే పెట్టవా అంటూ చెంపపై గట్టిగా కొట్టాడన్నారు. కొట్టిన విషయాన్ని ఎవరికైనా చెబితే 'నీ కథ చేస్తా' అని భయపెట్టాడని చెప్పారు. సాయంత్రం ఇంటికి వచ్చిన బాలిక ఏడుస్తూ విషయాన్ని తమకు చెప్పిందన్నారు. ఘటనపై రాత్రే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లగా ఎంఈఓతో మాట్లాడతామని చెప్పారని, రోజంతా ఎదురుచూసినా ఎలాంటి సమాధానం రాకపోవడంతో మీడియాను ఆశ్రయించినట్లు చెప్పారు. బాధ్యతగల ఎంఈఓ విద్యార్థినిని చితకబాదడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎంఈఓ–2 మధుసూదన్‌రాజును వివరణ కోరగా పాఠశాలలో కీర్తి అనే బాలిక ప్రవర్తన సరిగా లేనందున మందలించానని, తానేమీ చితకబాదలేదని తెలిపారు.

మీడియాపై దాడి సరికాదు



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

కర్నూలు(సెంట్రల్): తెలంగాణలో సినీనటుడు మోహన్‌బాబు మీడియాపై దాడిచేయడం సరికాదని జర్నలిస్టు సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు పేర్కొన్నారు. జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో దాడిని నిరశిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా ఎన్‌టీఆర్ సర్కిల్‌లో ర్యాలీ నిర్వహించి అనంతరం గాంధీ విగ్రహం ఎదుట మోహన్‌బాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీనియర్ జర్నలిస్టులు చంద్రశేఖర్, రవికుమార్, ప్రసాదు, నాగరాజు మాట్లాడుతూ.. కుటుంబ వ్యవహారాల్లో మీడియా జోక్యం చేసుకోదని, మోహన్‌బాబు కుటుంబమే బయటికి వచ్చి పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతుండడంతో మీడియా కవరేజీ కోసం ప్రయత్నించిందన్నారు. వివరణ ఇచ్చుకోవాల్సిన ఆయన దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే మీడియాపై మరోసారి దాడులు జరగకుండా రక్షణ చట్టాన్ని తేవాలని కోరారు. పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

శక్తిసదన్ పరిశీలన

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పర్యటించారు. దిశ వన్ స్టాప్ కేంద్రం, మహిళా ప్రాంగణం (శక్తి సదన్)ను తనిఖీ చేశారు. కార్యాలయాల రిజిస్టర్లు, అక్కడి సౌకర్యాలు, పరిశుభ్రతను పరిశీలించారు. దిశ వన్ స్టాప్ సెంటర్ ప్రాంగణ ఆవరణలో అపరిశుభ్రత నెలకొనడంతో వెంటనే శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు.

గడ్డిని చుట్టి.. అవస్థలు తీర్చి

- వరిగడ్డిని మోపులుగా కట్టేందుకు యంత్రాల వినియోగం
- తీరుతున్న పశుగ్రాసం కొరత



పొలంలో యంత్రం ద్వారా కట్టిన వరిగడ్డి మోపులు

గోస్పాడు: వరి ధాన్యం నూర్పిళ్ల అనంతరం మిగిలిన గడ్డిని పశువులకు గ్రాసంగా ఉపయోగిస్తారు. గతంలో వరిగడ్డిని సేకరించి కళ్లాల్లోకి తరలించే వరకు అనేక ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం ట్రాక్టరుకు అమర్చిన యంత్రాన్ని వినియోగించి గడ్డిని కట్టలుగా చుట్టి సేకరిస్తుండడం వల్ల ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా మారింది. గతంలో స్థానికంగా ఉండే పాడి రైతులు వరిగడ్డిని సేకరిద్దామనుకున్నా, ఎన్నో వ్యయప్రయాసలు ఉండడం వల్ల యంత్రంతో కోసిన వరిగడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టేవారు. దీంతో ఎండుగడ్డి కొరత ఏర్పడేది. పశుపోషకులు అధిక ధర వెచ్చించి వరిగడ్డిని కొనుగోలు చేయాల్సి వచ్చేది. కొందరు రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో వరికోతలు చేపట్టి గడ్డిని నిల్వ ఉంచుకునేవారు. ప్రస్తుతం యంత్రాలను తెచ్చి ట్రాక్టర్ సాయంతో పొలాల్లో పడి ఉన్న ఎండుగడ్డిని సేకరించి తీసుకెళుతున్నారు. ప్రతి పరకనూ ఏరి కట్టలుగా కట్టడంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల రైతులకు ఖర్చు తగ్గి తక్కువ సమయంలోనే పనులు పూర్తవుతున్నాయి. ఈ గడ్డిని కూలీల సాయంతో పశువుల పాకల వద్దకు చేర్చి ఒకదానిపై ఒకటి పేర్చి గడ్డివామిగా వేస్తున్నారు. వ్యవసాయంలో వచ్చిన యాంత్రీకరణతో రైతులు, కూలీలకు శ్రమ తగ్గుతోంది. అలాగే తక్కువ సమయంలోనే, కూలీల కన్నా తక్కువ రేటుకే పని పూర్తవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాడి పశువులకు పచ్చగడ్డి, ఇతర దాణాతో పాటు ఎండు గడ్డి కూడా అవసరం. యంత్రం ద్వారా కట్టలుగా చుట్టిన వరిగడ్డిని తరలించడానికి, భద్రపరచడానికి సులభతరమని రైతులు పేర్కొంటున్నారు.

నిప్పుపెట్టడం వల్ల నష్టం

రైతులు పొలంలో గడ్డిని మండించడం వల్ల కలిగే వేడి భూమిలో సుమారు సెంటీమీటరు లోతు వరకు వెళుతుంది. దీనివల్ల క్రమేపీ భూములు నిర్జీవంగా మారిపోతాయి. అంతేగాకుండా వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటను ఆశించే చీడపీడల ఉధృతి క్రమేపీ పెరుగుతుంది. గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో నత్రజని, పాస్పరస్, పొటాషియం, సల్ఫర్ తోపాటూ నేలలో ఉండే సేంద్రియ కర్బణాన్ని కూడా కోల్పోతుందని శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల్లో తేలినట్లు నిపుణలు చెబుతున్నారు.

ఎకరాకు వంద మోపులు

కొందరు రైతులు తమ పొలాల్లోని ఎండుగడ్డి సేకరణకు గతంలో కూలీలను ఉపయోగించేవారు. ఈ పద్ధతిలో కూలీల కొరత అధికంగా ఉంది. ఒకవేళ కూలీలు వచ్చినా అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తుంది. ఎకరా వరిగడ్డిని పాకల వద్దకు చేర్చడానికే రూ.7 నుంచి రూ.8 వేల వరకూ ఖర్చయ్యేలా ఉందని రైతులు పేర్కొంటున్నారు. అయితే వరిగడ్డిని కట్టలుగా కట్టేందుకు ప్రత్యేక యంత్రాలు అందుబాటులోకి రావడంతో పొలంలోని ఎండు గడ్డి పరకలను మొత్తం కట్టలుగా చుట్టేస్తున్నాయి. దీంతో గడ్డి ఎక్కడా వృథా కావడం లేదని రైతులు అంటున్నారు. ప్రత్యేక యంత్రం వరిగడ్డిని 30 కేజీల మోపులుగా చుట్టేస్తుంది. గడ్డి పెరిగిన తీరు, కోత చేసిన విధానాన్ని బట్టి ఎకరానికి తక్కువ అంటే 70 నుంచి మొదలుకొని సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. యంత్రం ద్వారా ఒక్క కట్టకు రూ.30, పొలం నుంచి పశువుల పాక వద్దకు చేర్చేందుకు కూలీలకు, రవాణా చార్జీలు కలుపుకుని మరో రూ.20 అవుతున్నట్లు రైతులు తెలిపారు. దీంతో ఎకరం వరిగడ్డికి రూ.4500 నుంచి రూ.5 వేల ఖర్చవుతుందని చెబుతున్నారు. అలాగే రోజూ పశువులకు మేత వేసేటప్పుడు గడ్డిమోపుల వల్ల వృథాను తగ్గించి, అవసరం మేరకు గడ్డి వినియోగించుకోవడానికి వీలుగా ఉంటుందని చెబుతున్నారు.



వరిగడ్డిని మోపుగా చుట్టేస్తున్న యంత్రం

పశుగ్రాసానికి సమస్య లేదు



కూలీల కొరత అధికంగా ఉండటంతో రైతులు సీజన్‌లో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం ట్రాక్టరు యంత్రాల ద్వారా గడ్డిని కట్టలుగా కట్టి సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత లేకుండా ఖర్చుతో పాటు త్వరగా పనులు చేసుకునేందుకు వీలవుతుంది. గడ్డి కూడా పశువులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– నాగేశ్వరరెడ్డి, రైతు

కాలుష్యాన్ని తగ్గించవచ్చు



గడ్డిని పొలంలోనే తగులబెట్టకుండా చుట్టలు చుట్టి విక్రయించడం ద్వారా కాలుష్యాన్ని నివారించడంతో పాటు పశుగ్రాసం కొరత తీర్చవచ్చు. పొగ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించవచ్చు. అలాగే నేల సారం కోల్పోకుండా ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో యంత్రాల వినియోగం వల్ల రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

– స్వప్నికారెడ్డి, వ్యవసాయాధికారి, గోస్పాడు